క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో పవిత్రోత్సవాలు



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు రెండో రోజు ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో వేదపండితులు కొమ్మూరి ఫణి కుమార్ శర్మ, ఆలయ ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు గోపూజ, సుప్రభాత సేవ, నిత్యార్చన, నవకుంభారోపణం, ఏకాదశ ద్రవ్యాభిషేకం, అన్నాభిషేకం, సుబ్రహ్మణ్యమాల మంత్ర అనుస్టానములు, హవనం, మూల మూర్తులకు ఉత్సవ మూర్తులకు పట్టు పవిత్రములు సమర్పణ, మహానివేదన, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ప్రదోష కలార్చన, నిత్య హోమం, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

యార్లగడ్డ బ్రాంచి కెనాల్‌లో పూడికతీత



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని వక్కలగడ్డ ఐదో నంబర్ యార్లగడ్డ బ్రాంచి కెనాల్‌లో మట్టి పూడికతీత పనులు చేపట్టారు. ఈ కాలువ పరిధిలో 2,500 ఎకరాల ఆయకట్టు ఉంది. కొంతకాలంగా పూడికతీత చేయక పోవడం వల్ల కాలువ కుచించుకుపోయింది. ఈ సమస్యను ఈ ప్రాంత రైతులు స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా పూడికతీత పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పొక్లెయిన్‌తో కాలువలో మట్టి పూడికతీత పనులు చేపట్టారు. డీఈ రావెళ్ల రవికిరణ్ ఈ పనులను పర్యవేక్షించారు. పూడికతీత పనులు చేయడం వల్ల సాగునీటి ఇబ్బందులు తప్పాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అన్యాయం



బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి అన్యాయం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొరిసెట్టి నాగేశ్వరరావు ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా చేపట్టిన రెండు రోజుల నిరసన కార్యక్రమాల్లో బాగంగా ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురం సెంటర్లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని వ్యవసాయ రంగాన్ని చిన్నచూపు చూస్తూ నిధుల కేటాయింపులో వివక్షకు గురిచేసిందని ఆరోపించారు. రూ.25 వేల కోట్లు సబ్సిడీల్లో కోతలు పెట్టడమే కాక గత 5 సంవత్సరాల్లో కేటాయించిన నిధులను వ్యవసాయ రంగానికి కేటాయించకుండా తిరిగి ప్రభుత్వానికి సరెండర్ చేయడమే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కేంద్ర బడ్జెట్ కారణంగా రైతులపై భారాలు పడ తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ధర్నా కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఎస్.జనార్దనరావు, ఎల్. అజయ్‌ఘోష్, బి.నాగరాజు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ నేతకు పామర్రు ఎమ్మెల్యే పరామర్శ

కోడూరు: మండలంలోని పిట్టల్లంక గ్రామానికి చెందిన జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ తండ్రి సుబ్బారావు వృద్ధాప్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదివారం సుబ్బారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బారావు అంతిమయాత్రలో పాల్గొని శవపేటికను మోశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్(రాజా), టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత సుబ్బారావు మృతదేహానికి నివాళులర్పించారు.

గ్రామదేవతలకు ఆషాఢ సారె

మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామదేవతలు శ్రీమల్లెలమ్మ అమ్మవారు, అంకమ్మ అమ్మవారు, సీతా దేవికి ఆషాఢ సారె సమర్పించుకున్నారు. ఆదివారం ఉదయం మహిళాభక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా ఆయా ఆలయాలకు చేరుకుని ఆషాఢ సారెను సమర్పించుకున్నారు.

మందుబాబులకు అడ్డా ఉల్లిపాలెం వారధి

- వారధి కింద భాగంలో కుప్పలుకుప్పలుగా ఖాళీ మద్యం సీసాలు
- పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం తాగుతున్న వైనం
- రాత్రి వేళల్లో వారధిపై వెళ్లాలంటే హడలిపోతున్న వాహనచోదకులు



ఉల్లిపాలెం-భవానీపురం వారధి

కోడూరు: దివిసీమ ప్రజలు జిల్లా కేంద్రమైన మచిలీపట్నంకు దగ్గర మార్గంలో వెళ్లేందుకు కృష్ణానదిపై నిర్మించిన ఉల్లిపాలెం-భవానీపురం వారధి మందుబాబులకు అడ్డాగా మారింది. మండలంలోని ఉల్లిపాలెం కరకట్ట వద్ద నుంచి బందరు మండలం కమ్మవారి చెరువు కరకట్టలను కలుపుతూ 2019లో ఉల్లిపాలెం-భవానీపురం (అంబటి బ్రాహ్మణయ్య వారధి) వారధిని నిర్మించారు. కృష్ణానదిపై సుమారు 550 మీటర్ల మేర వంతెనను నిర్మించి, వారధిని కలుపుతూ ఇరువైపులా 1.2 కిలోమీటర్ల మేర నూతన రహదారులను నిర్మించారు. అయితే నదిలోని నీరు ఆటుపోట్ల సమయంలో రహదారిని తాకే అవకాశం ఉండడంతో రోడ్లకు భద్రత కల్పిస్తూ గ్యాబిన్ బాక్స్‌లను(కొండ రాళ్లను పీవీసీ మెస్ బాక్స్‌ల్లో పేర్చడం) నిర్మించారు. ప్రస్తుతం ఆ గ్యాబిన్ బాక్స్‌లే మందుబాబులకు అడ్డాగా మారాయి. వారధి దిగువకు వెళ్లేందుకు గ్యాబిన్ బాక్స్‌ల పైనుంచి దారి ఉంది. దీంతో మందుబాబులు ఈ గ్యాబిన్ బాక్స్‌లతో పాటు వారధికి ఇరువైపులా ఉన్న రెండు పైల్‌క్యాప్‌లను తమ అడ్డాగా చేసుకొని మద్యం తాగుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా యువకులు గుంపులు గుంపులుగా చేరి మద్యం తాగడంతో పాటు ఆ ఖాళీ సీసాలను కొండరాళ్లపై పగలకొట్టడంతో ఆ ప్రాంతమంతా అధ్వానంగా మారింది. రాళ్ల మధ్యలో గాజు పెంకులు ఉండిపోవడంతో నదిలో వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఉల్లిపాలెం, భవానీపురం ఇరువైపులా ఖాళీ మద్యం సీసాలు, బీరు బాటిళ్ల కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

వారధిపై కానరాని విద్యుత్ సౌకర్యం..

సుమారు రూ.77 కోట్ల వ్యయంతో వారధిని నిర్మించారు. అయితే వారధికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో ఈ ప్రాంతం భయానకంగా ఉంటోంది. తెలుగు తల్లి విగ్రహం వద్ద నుంచి భవానీపురం వరకు ఏవిధమైన విద్యుత్ దీపాలు లేకపోవడంతో వాహనచోదకులు రాత్రి సమయంలో అటుగా వెళ్లేందుకు హడలిపోతున్నారు. మందుబాబులు మద్యం మత్తులో దాడులకు తెగబడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. వారధి ఇరు పంచాయతీలకు సంబంధించింది కావడంతో ఆయా పంచాయతీలు విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టించుకోని పోలీస్‌శాఖ..

వారధి ప్రాంతాన్ని మందుబాబులు తమ అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా పోలీస్‌శాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. వారధి ప్రాంతంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద సీసీ కెమెరాలు ఉన్నా కూడా అవి పని చేసిన దాఖలాలు లేవని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు కనీసం వారధి ప్రాంతంలో కూడా గస్తీ నిర్వహించకపోవడంతో మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వారధి వద్ద మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఉల్లిపాలెం వైపు కుప్పగా ఉన్న ఖాళీ మద్యం సీసాలు

మందుబాబుల ఆగడాలు అరికట్టాలి



ఉల్లిపాలెం వారధిని మందుబాబులు అడ్డాగా చేసుకొని పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా మద్యాన్ని తాగుతున్నారు. రాత్రి వేళల్లో వాహనచోదకులపై దాడులు కూడా చేస్తున్నారు. పోలీసులు మందుబాబుల ఆగడాలను అరికట్టాలి.

– కమ్మిలి కోటేశ్వరరావు, ఉల్లిపాలెం

లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



ఉల్లిపాలెం-భవానీపురం వారధి వద్ద విద్యుద్దీపాలు లేకపోవడంతో మందుబాబులు రాత్రి వేళల్లో రెచ్చిపోతున్నారు. ఉల్లిపాలెం కరకట్ట వద్ద నుంచి కమ్మవారిచెరువు వరకు వారధి పొడవునా విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– బడే ధనరాజ్, ఉల్లిపాలెం

బారా ఇమామ్ పంజాలో ప్రత్యేక ప్రార్థనలు

గూడూరు: గూడూరులోని బారా ఇమామ్ పంజాలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహరంను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రార్థనలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంజాలో అన్న సమారాధన నిర్వహించారు. ప్రార్థనలకు ఆచరణ భక్తులు తబర్రుక్ స్వీకరించారు. కార్యక్రమంలో పంజా అధ్యక్షుడు మహమ్మద్ సాహెబ్, సెక్రటరీ మున్వర్ పాషా, రఫీ జానీ, షేక్ బాజీ, అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగిశెట్టి ధర్మయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఎస్సీల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీల కోసమే సద్వినియోగం చేయాలన్నారు. నిధుల వినియోగంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ ఉద్యోగులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం జీతంతో కూడుకున్న స్టడీలీవ్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఎస్సీ, ఎస్టీ రోస్టర్ల తనిఖీపై జారీ చేసిన జీవోల ప్రకారం జిల్లాస్థాయిలో అధికారులు రోస్టర్లను తనిఖీ చేయాలన్నారు. రాష్ట్రంలో ఇవ్వాల్సిన నామినేటెడ్ పదవుల్లో నామినేటెడ్ పదవుల్లో సంఘ పరిధిలో పనిచేసిన వారికి ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కర్ర సునీల్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి తదితరులు బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని పునఃనిర్మించడానికి దృఢనిశ్చయంతో ఉన్నందున వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నామినేటెడ్ పదవుల్లో భాగంగా సముచిత స్థానాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మద్దాల కృష్ణకుమార్, దాసి జయప్రకాష్, కొసనం క్రాంతికుమార్, కొండ్రు రాజు తదితరులు ఉన్నారు.

ఫణికుమార్‌కు స్వర్ణనంది అవార్డు



స్వర్ణనంది అవార్డును అందుకుంటున్న ఫణికుమార్

పెడన: పెడనకు చెందిన పిచ్చుక ఫణికుమార్‌కు మెగా ఎంటర్ ప్రైజెస్ సంస్థ ఆదివారం స్వర్ణనంది అవార్డును అందజేసింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గానసభ ఆడిటోరియంలో మెగా ఎంటర్ ప్రైజెస్ సంస్థ వారి అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. పెడనకు చెందిన సేవా తత్పరుడు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వాహకుడు, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ (ఏఐడబ్ల్యూఎఫ్)కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడు పిచ్చుక ఫణికుమార్ ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యుడు సతీష్, ప్రముఖ సినీ నటుడు జెమిని సురేష్, సినీ దర్శకుడు రుద్ర శ్రీనివాస్, పారిశ్రామికవేత్త శ్యామ్ సుందర్, అను క్లినిక్స్ అధినేత్రి అను తదితరుల చేతుల మీదుగా స్వర్ణ నంది అవార్డును అందుకున్నారు. అవార్డుతో పాటు కళాకార్ సేవా రత్న బిరుదు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏఐడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్, కృష్ణాజిల్లా కార్యదర్శి ఆకురాతి జనార్దనరావు, కోశాధికారి తాళ్ల బాలాజీ, ఆశపు సముద్రేశ్వరరావు, ఆశపు కోటనాగబసవయ్య, కట్టా హేమంత్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

152 మందికి ఉచితంగా కంటి పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు సుభాష్, ఆదిత్య, వైద్య సిబ్బంది, నిర్వాహకులు

నాగాయలంక: అంధత్వ నివారణే లక్ష్యంగా సుదర్శి మానవతా సేవాసంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 44వ ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరాన్ని నాగాయలంక తహసీల్దార్ ఎం.హరనాథ్ ప్రారంభించారు. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి వెంకయ్య /జ్ఞాపకార్థం వారి కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో 152మందికి పరీక్షలు చేయగా 124మందికి ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్రచికిత్సలకు బస్సులో శంకర కంటి ఆసుపత్రికి పంపించినట్టు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. శిబిరంలో డాక్టర్ కమల, డాక్టర్ రితిక నేత్ర పరీక్షలు జరిపారు. లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

- రూ.70 లక్షల నిధులు కేటాయింపు
- కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్



కృత్తివెన్ను: మండల పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైన పైపులైన్లు, ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు, అంతర్గత రహదారుల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, పక్కా డ్రైనేజీ వ్యవస్థ మొదలైన పనులను మండల పరిషత్ నిధుల నుంచి ఖర్చు చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నట్లు కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ తెలిపారు. దీంతో ఇప్పుడు మండలంలోని పలు గ్రామాల్లో వీటికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వీటిపై ఎంపీపీ 'సాక్షి'తో మాట్లాడుతూ అభివృద్ధి పనులను వివరించారు ఆయన మాటల్లోనే..

మండలంలోని చాలా గ్రామాల్లో అంతర్గత సమస్యలతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా విషయంలోనూ చాలా సమస్యలున్నాయి. వీటిని అధిగమించి ప్రజలకు మంచి పాలన అందించే దిశగా మండల పరిషత్ నుంచి ఎటువంటి భేషజాలు లేకుండా అభివృద్ధిని చేపట్టాను.

పక్కాడ్రైనేజీ వ్యవస్థ (సీసీ) కోసం రూ.16.60 లక్షలు, తాగునీటి సరఫరా నిమిత్తం పైపులైన్లు రిపేర్లు, నూతన పైపులైన్‌ల ఏర్పాటుకు రూ.16.25 లక్షలు, 15వ మండల ఆర్థిక సంఘం నిధుల నుంచి అంతర్గత రహదారుల కోసం (జీఎస్‌బీ, సీసీ) రూ.27.0 లక్షలు, మండల సాధారణ నిధుల నుంచి రూ.10.0 లక్షలతో మండలంలో అభివృద్ధి పనులు చేస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు, సబ్ సెంటర్లకు సీసీ రోడ్లు, సీపీడబ్ల్యూఎస్ స్కీం పైపులైన్ మరమ్మతులు తదితర పనులు జరుగుతున్నాయి. పార్టీలకతీతంగా గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల పర్యవేక్షణలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాను. రాబోవు రోజుల్లో కూడా మండలాభివృద్ధి కోసం నావంతు కృషి చేస్తాను.

సృజనాత్మకతతో రాణింపు

పెడన: మహిళలు స్వయంశక్తితో రాణించడానికి సృజనాత్మకత చాలా ముఖ్యమని, నేటి సమాజంలో ఉచితంగా అందించే శిక్షణలను సద్వినియోగం చేసుకుని రాణించాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీహెచ్ హరిదాస్ అన్నారు. పట్టణంలోని శివార్జున నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో ఉచితంగా మగ్గం వర్క్ – శారీ పెయింటింగ్ శిక్షణ తరగతులు ముగియడంతో ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు సహాయం చేసే స్వచ్ఛంద సంస్థలలో సహాయ ఫౌండేషన్ ముందుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉస్మాన్ బాషా, మట్టా రాధాకృష్ణమూర్తి, కాగిత శంకర సాంబశివరావు, శిక్షకులు రామినేని దుర్గా నారాయణమ్మ , పిచ్చుక నాగమణి, కాలేపు సూరిబాబు, సత్యనారాయణ, నాగరవి, సుధారాణి, ఉమా, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు ఆషాఢ సారె

కోడూరు: రజకుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న అంకాలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ఆషాఢ సారెను సమర్పించారు. దప్పువాయిద్యాల నడుమ రజకుల కులస్తులు సారెను ఊరేగించారు. వివిధ రకాల పండ్లు, పువ్వులతో పాటు చీరలు, గాజులు, నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి భక్తి భావం చాటుకున్నారు. గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.220 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

- రూ.160 కోట్లతో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం
- ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లాలో జలజీవన్‌మిషన్ ద్వారా రూ.220 కోట్లతో ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమలుకు అవసరమైతే మరిన్ని నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.160 కోట్లతో గ్రామాల్లోని రహదారులు, డ్రెయిన్లు, శ్మశానవాటికలకు కాంపౌండ్‌వాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మచిలీపట్నం నగరంలో మురుగుకాలువల్లో పేరుకుపోయిన సిల్టు తొలగించటంతో పాటు డ్రెయిన్లను మరమ్మతులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. రానున్న రోజుల్లో నగరంలో మురుగునీరు నిల్వ ఉండకుండా ఉండేలా డ్రెయినేజీ వ్యవస్థపై మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించేందుకు ఇటీవల ఢిల్లీ అధికారుల బృందం పర్యటించిందన్నారు. ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా 250 అర్జీలు స్వీకరించామని వాటిలో తక్షణం పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించామన్నారు. పరిస్థితులను బట్టి వారంలో శని, ఆదివారాల్లో ఏదొక రోజు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారుమడులు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నారుమడులను తిరిగి పోసుకునేందుకు రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించామన్నారు. కాలువల్లో పేరుకుపోయిన తూడు కాడ, గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించామన్నారు.

భారీ ఊరేగింపుతో పైడమ్మకు సారె



కాపుల వీధి నుంచి పైడమ్మ అమ్మవారికి సారె ఇచ్చేందుకు ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు

పెడన: పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి ఆదివారం గ్రామ దేవత అయిన శ్రీపైడమ్మ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాఢం సారెను సమర్పించారు. కాపుల వీధిలోని మహిళలు ఊరేగింపులో మేళతాళాలతో బయలుదేరి పాత కూరగాయల మార్కెట్ వద్ద పోతురాజు స్వామి గుడి వద్ద, గుడివాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఘటం గుడి వద్ద ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట తుదిగా పైడమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు. శిష్టకరణం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం సమీపంలోని వారి ప్రాంతం నుంచి ఊరేగింపుగా బయలుదేరి శ్రీపైడమ్మ అమ్మవారికి ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు. బ్రహ్మపురంలోని దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పైడమ్మ దేవస్థానానికి చేరుకుని ఆషాఢం సారెను అమ్మవారికి అందజేశారు. ఉదయం నుంచి అమ్మ వారి ఆలయంలో భక్తులు దర్శనం కోసం పోటెత్తారు. ఆలయ ఈవో టీవీవీ మోహనరావు, వంశపారంపర్య ధర్మకర్త దాసు వాయునందనరావు తదితరులు పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కదంబం ప్రసాదాలను అందజేశారు.

అ'పూర్వ' కలయిక



1997-98వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు

- 26 ఏళ్ల తరువాత కలిసిన పదో తరగతి పూర్వ విద్యార్థులు
- ఉపాధ్యాయులకు పాదపూజ, సత్కారాలు

కోడూరు: 'ఏరా బావా.. ఏం చేస్తున్నావు.. ఎక్కడ ఉంటున్నారు.. అమ్మా నాన్న ఎలా ఉన్నారు.. పిల్లలు బాగున్నారా..' అంటూ పూర్వ విద్యార్థుల ఆప్యాయ పలకరింపులకు ఆదివారం కోడూరు దానాశక్తి ఆర్యవైశ్య కల్యాణ మండపం వేదికగా మారింది. కోడూరులోని బాలభాను విద్యాలయంలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 26 ఏళ్ల తరువాత విద్యార్థులంతా ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులపై వేసిన ఛలోక్తులు, గురువులు వీరిని శిక్షించిన తీరును గుర్తు చేసుకుని నవ్వుకున్నారు. ఒకరికొకరు వారి కుటుంబసభ్యులను పరిచయం చేసుకున్నారు. తమకు విద్యా బోధన చేసిన గురువులు పాగోలు మురళీకృష్ణ, పాగోలు మహేశ్వరరావు, మెండు ఉమామహేశ్వరరావు, లక్ష్మి, హుస్సేన్‌లకు విద్యార్థులు పాదపూజ చేసి దుశ్శాలువాలతో సత్కరించారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు



కోడూరు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో నిర్వహిస్తున్న 'అమ్మకు వందనం' కార్యక్రమంలో భాగంగా స్థానిక బీజేపీ నేతలు ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోడూరు పీహెచ్‌సీ ప్రాంగణంలో బీజేపీ నేతలు వివిధ రకాల పండ్లు, కూరగాయల మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు నివ్వాలని పిలుపునిచ్చారు. బీజేపీ కోడూరు, అవనిగడ్డ, చల్లపల్లి నాగాయలంక మండలాల అధ్యక్షులు వడుగు నాగబాబు, బచ్చు విజయలక్ష్మి, పిండి రేవతిశివ, కన్నా వెంకటేశ్వరరావు, మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్నసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రోజే వంద మొక్కలు నాటిన ఉపాధ్యాయుడు

కోడూరు: సామాజిక కార్యక్రమాలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఉపాధ్యాయుడు కాశీబోట్ల నాగభూషణం ఆదివారం ఒక్క రోజే వంద మొక్కలు నాటారు. సెలవుదినం కావడంతో నాగభూషణం సామాజిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వారం రోజుల నుంచి రోజుకో మొక్కను వివిధ ప్రాంతాల్లో నాటుతున్నారు. ఆదివారం జరుగువానిపాలెం గ్రామ రహదారి పొడవునా వంద మొక్కలను నాటారు. తన సొంత డబ్బులతో మొక్కలను కొనుగోలు చేసి విద్యార్థుల సహకారంతో మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలను నాటాలని నాగభూషణం కోరారు. లింగారెడ్డిపాలెం సర్పంచి యర్రంశెట్టి శ్రీదుర్గ కార్యక్రమంలో పాల్గొని నాగభూషణంను అభినందించారు.

మద్యం సీసాలు స్వాధీనం

కోడూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను కోడూరు పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కోడూరు ఎస్ఐ శిరీష తెలిపిన వివరాల మేరకు...మండలంలోని ఇస్మాయిల్‌బేగ్‌పేట చెరువు సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఆటో కోసం నిలబడి ఉన్నారు. వీరి వద్ద సంచి ఉండడంతో పాటు వారు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారి చేతిలో సంచిని పరిశీలించగా అందులో 14 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

ఘంటసాల: రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి హైస్కూల్స్‌కు మంచి పేరు తీసుకురావాలని ఘంటసాల, శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్స్ హెచ్ఎంలు ఎం.శ్రీరంగవల్లి, అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి కోరారు. మండల పరిధిలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక ఆదివారం నిర్వహించారు. జూనియర్స్ విభాగం రాష్ట్ర స్థాయిలో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలకు ఘంటసాల, శ్రీకాకుళం గ్రామాలకు చెందిన జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ జట్టుకు జూనియర్ విభాగంలో ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రెబ్బా నవీన్ కుమార్ ఎంపిక కాగా, శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చిట్టూరి సన్నీ జూనియర్స్ బాలుర విభాగంలో, పైడిపాముల అక్షయ బాలికల విభాగంలో ఎంపికైనట్లు ఆయా హైస్కూల్స్ హెచ్ఎంలు వెల్లడించారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలు వి.వి.పిచ్చేశ్వరరావు, బడే వెంకటేశ్వరరావులతో పాటు పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. విద్యార్థులు ఆగస్టు 11వ తేదీ నుంచి శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.